'ఇచ్చంపల్లి'ని అడ్డుకుంటం

'దేవాదుల'ను కాపాడుకుంటం

- కావాలనే మామునూరు విమానాశ్రయం మూసివేత
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని సాధిస్తాం
- తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ ఎంపీలే
- గులాబీ పార్టీలోనే ఉద్యమకారులకు గుర్తింపు
- నాలాంటి వాళ్లెందరో ఉదాహరణ
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్

వరంగల్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'నదుల అనుసంధానం పేరిట ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు కట్టి తెలంగాణను ఎండబెట్టి గోదావరి నీటిని తమిళనాడుకు తరలిచేందుకు బీజేపీ కుట్రపన్నుతున్నది. ఇదే జరిగితే సమ్మక్క బరాజ్ మనుగడ ప్రశ్నార్థకమై దేవాదుల నీళ్లు రాక ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం జరుగుతది. ఎట్టిపరిస్థితుల్లోనూ తెలంగాణకు, ఉమ్మడి వరంగల్‌కు నష్టం కలిగించే ఇచ్చంపల్లి ప్రాజెక్టును అడ్డుకొని తీరుతాం.. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలంటే బీఆర్ఎస్ ఎంపీలే పార్లమెంట్‌లో ఉండాలె' అని వరంగల్ లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ తెగేసిచెప్పారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'నాలుగు పిల్లర్లు కుంగాయన్న సాకుతో మేడిగడ్డ ప్రాజెక్టును కక్షపూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెట్టింది. గోదావరి నీటిని వృథాగా సముద్రం పాలుజేసింది.. నీటి లభ్యత ఉన్నప్పుడు కూడా సమ్మక్క బరాజ్‌లో నిల్వ చేయకుండా దేవాదుల ఆయకట్టు రైతులను నిండా ముంచింది.' అని ఆవేదన వ్యక్తం చేశారు.

● వ్యవసాయరంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై మీ అభిప్రాయం?

వ్యవసాయ పరంగా ప్రచంచంలోనే మనదే శానికి ప్రత్యేక పాత్ర ఉన్నది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే పనిలో ఉన్నాయి. రెండుసార్లు ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ, దేశంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రైతుబంధు పెంచి ఇస్తామని చెప్పి రైతులకు మొండిచెయ్యి చూపింది. గతంలో ఇచ్చిన రూ.5 వేలను కూడా అందరికీ ఇవ్వడంలేదు. యాసంగి పంటకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి ఆత్మస్థయిర్యం సన్నగిల్లి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మేడిగడ్డ బరాజ్‌లో చిన్న మట్టి కట్ట కట్టి నీటిని పంపిణీ చేయాల్సింది పోయి, ఉన్న నీటిని సముద్రం పాలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. బీజేపీ సైతం తన స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు కట్టి గోదావరి నీటిని తమిళనాడుకు తరలించాలని చూస్తున్నది. ఇదే జరిగితే తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుంది. దీన్ని అడ్డుకునేందుకైనా తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరుతున్నా.

● మీరు కొత్తగా లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. ఇలాంటి అవకాశం దక్కుతుందని ఏనాడైనా అనుకున్నారా?

నా రాజకీయ ప్రస్థానంలో బీఆర్ఎస్ ఇప్పటికే ఎన్నో మంచి అవకాశాలు కల్పించింది. సామాన్య కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే ఏకైక పార్టీ భారత రాష్ట్ర సమితి ఒక్కటే. బీఆర్ఎస్‌లో అతి సామాన్య కార్యకర్తకు కూడా ఉన్నతమైన పదవులు వస్తాయనేందుకు నాతోపాటు చాలా మంది ఉదాహరణ. ఉద్యమకారులు, కార్యకర్తలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, చైర్మన్లుగా చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో సాధారణ కార్యకర్తలుగా ఉండి హనుమకొండలో నేను, జనగామలో సంపత్‌రెడ్డి, ములుగులో జగదీశ్, భూపాలపల్లిలో జక్కు రాకేశ్ భార్య శ్రీహర్షిణి జడ్పీ అధ్యక్షులమయ్యాం. తెలంగాణ ఉద్యమ ప్రారంభం నుంచి నేను కేసీఆర్ వెన్నంటే ఉన్నా. పదవులు లేకున్నా ఏనాడూ నేను ఉద్యమ బాట వీడలేదు. క్రమశిక్షణతో పని చేస్తే పదవులు వాటంతటవే వస్తయ్. కేసీఆర్ దీవెనలతో గొప్ప అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి అభ్యర్థులే కుంటే బీఆర్ఎస్ నుంచి లాక్కున్నరు. అయినా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నరు.

● ప్రచార సరళి? నాయకులు, కార్యకర్తల సహకారం ఎలాఉంది?

అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాం. ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మంచి సహకారం అందిస్తున్నరు. కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తున్నరు. అన్ని సెగ్మెంట్లలో కార్యకర్తలు ఏకతాటిపై నడుస్తున్నరు. సోమవారం నేను నామినేషన్ వేసిన సందర్భంలో ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు.

● వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి ఏంచేస్తారు?

హనుమకొండ జడ్పీ అధ్యక్షుడిగా ఉన్న నాకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలపై అవగాహన ఉన్నది. మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించాలి. 1875 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయస్థాయిలో ఉన్న ఈ ఎయిర్‌పోర్టును ఉమ్మడి ప్రభుత్వాలు కుట్రపూరితంగా నిర్వీర్యం చేశాయి. యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు మామునూరు విమానాశ్రయాన్ని కావాలనే మూతపడేశాయి. వేయిస్తంభాల గుడి, ఓరుగల్లు ఖిలా, రామప్ప, మేడారం సమ్మక్క-సారక్క జాతర, ఆసియాలోనే పెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్ల ప్రాధాన్యతను తగ్గించే కుట్రలో భాగంగానే ఇక్కడ ఎయిర్‌పోర్టును పునరుద్ధరించడంలేదు. కేరళలోని కన్నూర్, కోజికోడ్ అంతర్జాతీయ విమానాశ్రయాల మధ్య దూరం కేవలం 99 కిలోమీటర్లే. తెలంగాణలో రెండో పెద్ద నగరంగా ఉన్న వరంగల్‌లో 11 లక్షల జనాభా ఉంది. ఉమ్మడి వరంగల్‌లో 50 లక్షల జనాభా ఉన్నా మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం నానా కొర్రీలు పెడుతున్నది. జార్ఖండ్‌లో కేవలం 2లక్షల జనాభా ఉన్న దేవ్‌ఘడ్‌లో రూ.6వేల కోట్లతో విమానాశ్రయాన్ని నిర్మించింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఐఐటీ, ఐఐఎం, ఐఎస్ఎఆర్, ట్రిపుల్ ఐటీతో పాటు ప్రతి జిల్లాకో నవోదయ స్కూల్‌ను తెస్తాం.

ప్రస్తుత ఎన్నికల్లో మీకు ప్రధాన ప్రత్యర్థి ఎవరని భావిస్తున్నారు?

జాతీయ పార్టీలుగా గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్, బీజేపీలకు కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇక్కడ అభ్యర్థులే కరువయ్యారు. ఎక్కడాదిక్కు లేక బీఆర్ఎస్ నుంచి తీసుకొని నిలబెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, కడియం శ్రీహరి స్కూల్ నుంచి వచ్చిన వారే. నువ్వు గెలిచినా ఒక్కటే, నేను గెలిచినా ఒక్కటే అనే ఒప్పందంతో వారు పోటీకి దిగారు. వీరిద్దరినీ ప్రజలు గమనిస్తున్నరు. దేశ చరిత్రలో పెద్ద నమ్మక ద్రోహి కడియం శ్రీహరి. మచ్చలేని నాయకుడినని, నిబద్ధతతో పని చేస్తానని చెప్పుకునే కడియం శ్రీహరి రాజకీయ పునర్భిక్ష పెట్టిన బీఆర్ఎస్‌కు ఎంత నమ్మక ద్రోహం చేశాడో ప్రజలంతా గమనించారు. బీఆర్ఎస్‌కు కావ్య పోటీ కాదు. బీఆర్ఎస్‌కు కడియం, అరూరి చేసిన నమ్మక ద్రోహమే వారి ఓటమి, నా గెలుపునకు నాంది.

సీతక్క పేషీలో 'కర్ణాటక' పీఎస్?

- తెలంగాణ వాళ్లు దొరకలేదా? అని విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేషీలో కర్ణాటకకు చెందిన వ్యక్తిని పీఎస్‌గా (ప్రైవేట్ సెక్రటరీ) నియమించుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బళ్లారికి చెందిన శ్రీజను పీఎస్‌గా నియమించుకున్నట్టు సమాచారం. ఆమెకు తెలుగులో మాట్లాడటం తప్ప, తెలుగు రాయడంగానీ, చదవడంగానీ రాదని తెలిసింది. శాఖాపరమైన కీలక నిర్ణయాలన్నింటిలోనూ ఆమె భాగస్వామ్యం ఉంటుందని సమాచారం. దీంతో ఈ నియామకం అటు రాజకీయ వర్గాల్లో, ఇటు నిరుద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి పేషీలో నియమించుకోవడానికి తెలంగాణలో ఎవరూ దొరకలేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శాఖాపరమైన నిర్ణయాలు, పేషీలో ఫైళ్ల కదలిక కూడా 'కర్ణాటక' వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందా? అంటూ ఎద్దేవా చేస్తున్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో మంత్రి సీతక్క పాల్గొన్న సమయంలోనూ సదరు మహిళ వెంబడే ఉన్నారట. దీనిని బట్టి ముందస్తుగానే కర్ణాటక నేతలతో ఒప్పందం కుదిరిందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మంత్రి సీతక్క పేషీ వివాదాల్లో ఉండగా, తాజా వ్యవహారం తలనొప్పిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తవా?

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వని రేవంత్‌రెడ్డి.. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తారా? అని ఎద్దేవా చేశారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయటం తగదని సీఎంకు హితవు పలికారు. ఆగస్టు 15న రుణమాఫీ చేస్తానని ఎవరి చెవుల్లో పువ్వులు పెడతావని ప్రశ్నించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తానని ఎందుకు చేయలేదని నిలదీశారు.

కాంగ్రెస్‌కు చురకలు పెడితేనే గ్యారెంటీల అమలు

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం అవుతుందని హరీశ్ విమర్శించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి చురక పెడితేనే ఆరు గ్యారెంటీలు అమలవుతాయని ప్రజలకు తెలిపారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలు మరచి కేసీఆర్‌ను తిడితే ఏమొస్తుంది? నీ(రేవంత్) మాటలే నీకు ఉరితాళ్లు అవుతాయి. కేసీఆర్‌ను తిట్టినా, దేవుళ్ల మీద ఒట్లు పెట్టినా ప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించరు. కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పారు' అని వెల్లడించారు. ప్రజలు, రైతులు, ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగుల ఉసురు తీసుకుంటున్న రేవంత్ సర్కార్‌కు ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. సీఎం అపాయింట్‌మెంట్ దొరకటం లేదని కాంగ్రెస్ సొంత నేతలు వీ హన్మంతరావు, మోత్కుపల్లి చెప్తున్నారని గుర్తుచేశారు.

సోషల్‌మీడియాలో బీజేపీ దుష్ప్రచారం

సోషల్ మీడియాలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నదని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మంచి చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లోనే గెలిచేవారని, దుబ్బాకను అభివృద్ధి చేయనందుకే ప్రజలు బుద్ధి చెప్పారని వెల్లడించారు. కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వడ్లను కొనలేదని, నేడు ఏ ముఖం పెట్టుకొని బీజేపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమానికి వస్తున్నారని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు ఒక్క మేలైనా చేసిందా? అని ప్రశ్నించారు. అంబానీ, ఆదానీలకు రూ.13 లక్షల కోట్లు మాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం.. రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తెరిచిన పుస్తకమని ఉత్తమ అధికారిగా, మానవతావాదిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా బెస్ట్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కట్టించిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ నాలుగు లక్షలకు పైగా మెజార్టీతో మెదక్ ఎంపీ స్థానాన్ని గెలిచిందని, మళ్లీ అదే రిపీట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశాల్లో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునితాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మాణిక్యం, దేశ్‌పాండే, రాజేందర్, సత్యంగౌడ్, సింగాయిపల్లి గోపి, బీఆర్ఎస్ యువ నాయకుడు సంతోష్‌రెడ్డి, వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితర నేతలు

> రేవంత్‌రెడ్డి అంటే మాటల కోతలు.. కాంగ్రెస్ పార్టీ అంటే కరెంటు కోతలు
> - హరీశ్‌రావు

మార్పు కాంగ్రెస్ నేతల జీవితాల్లోనే..

రేవంత్‌రెడ్డి నాలుగున్నర నెలల పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని, కాంగ్రెస్ నేతల జీవితాల్లోనే మార్పులు వచ్చాయని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు నమ్మి ఓటు వేస్తే హామీలు నెరవేర్చకుండా రైతుల గుండె మీద తన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు రైతుల ఆత్మహత్యలు, మరోవైపు పంటలు ఎండి అవస్థలు పడుతుంటే.. సీఎం, మంత్రులు ఇప్పటివరకు ఆ కుటుంబాలను పరామర్శించలేదని మండిపడ్డారు. కరీంనగర్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. అతి తక్కువ సమయంలో కాంగ్రెస్ పాలనేమిటో ప్రజలకు అర్థమైందని, ఆ పార్టీకి బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఆదరణ ఇంకా తగ్గుతున్నదని వెల్లడించారు.

ఆగస్టు 15 వరకు సీఎంగా ఉంటవా?

- ఒక్క హామీని నమ్మించేందుకు ఇన్ని ఒట్లా?
- అన్ని హామీలకు సీఎం రేవంత్ రెడ్డి ఇంకెన్ని ఒట్లుపెడుతడో!
- నిన్ను ముట్టుకుంటే షాక్ కొట్టేందుకు ఇదేం మగధీర సినిమా కాదు
- బీజేఎల్పీ నేత ఏలేటి మాహేశ్వర్ రెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : 'సీఎం రేవంత్‌రెడ్డికి ఆగస్టు భయం పట్టుకున్నది. ఆయన మాటలను ప్రజలు నమ్మడం లేదనే ఇలా ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని వరుస ఒట్లు పెడుతున్నడు. ఆగస్టు వరకు రేవంత్ సీఎంగా ఉంటడో లేదో తెలియకనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సీఎం స్థాయి వ్యక్తి అంటున్నడు' అని బీజేఎల్పీ నేత ఏలేటి మాహేశ్వర్ రెడ్డి దెప్పిపొడిచారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఒక్క హామీ కోసమే ఇన్ని ఒట్లు పెడితే, కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటికీ ఇంకెంత మంది దేవుళ్లపై ఒట్లు పెడుతడో!.. ఊరూరు తిరిగి పోచమ్మ, మైసమ్మమీద కూడా ఒట్టు పెడుతడేమో!' అని ఎద్దేవా చేశారు. 'సీఎం రేవంత్ రెడ్డి తాను హైటెన్షన్ వైరును అంటున్నడు.. నిన్ను ముట్టుకుంటే షాక్ కొట్టేందుకు ఇదేం మగధీర సినిమా కాదు' అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ఏ ఊరికి వెళ్లినా అక్కడి నేతను 'సీఎం స్థాయి వ్యక్తివి నువ్వే' అని అంటాడేమో అని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు గోసపడుతున్నారని, తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇంత కరువు ఎప్పుడూ రాలేదని గుర్తుచేశారు. అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని, రైతులకు నష్టం కలుగుతున్నా ప్రభుత్వం ధాన్యం కొనడం లేదని, గిట్టుబాటు ధర, రూ.500 బోనస్ ఇవ్వడం లేదని, రుణమాఫీపై సీఎం మాటమార్చి తీరా ఇప్పుడు దేవుళ్లపై ఒట్లు పెట్టుకుంటూ వస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీతో పాటు ఇతర హామీల అమలుకు రూ.లక్ష కోట్లు కావాలని, ఈ లెక్కన ఇతర హామీలకు ఏ స్థాయిలో బడ్జెట్ కావాలో ఊహించుకోవచ్చన్నారు. వీటికి డబ్బు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. హామీలన్నీ నెరవేర్చకపోతే రాజీనామా చేస్తావా? అని రేవంత్‌ను ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి ఎప్పుడు ఏ రంగు మారుస్తాడో ఎవరికీ తెలియదని, టీడీపీలో మాదిరిగానే ఇప్పుడూ మాట్లాడుతున్నాడని విమర్శించారు.

బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఉదయ్ కుమార్‌కు అందజేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతుకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీఆర్ఎస్ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్. చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ఆధారాల్లేకుండానే కవిత అరెస్టు

- అనుమానితురాలు కూడా కాదు..
- కానీ నిందితురాలిగా మార్చివేశారు
- బీఆర్ఎస్‌కు ఆమె స్టార్ క్యాంపెయినర్
- కవితకు బెయిల్ ఇవ్వాల్సిందే: అభిషేక్ సింఘ్వీ
- బెయిల్‌పై నేడు వాదనలు

అభిషేక్ సింఘ్వీ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): సహేతుకమైన ఆధారాలు లేకుండానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని, అనుమానితురాలిగా కూడా లేని వ్యక్తిని ఏకంగా నిందితురాలిగా మార్చారని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి చెప్పారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో ప్రస్తుతం కస్టడీలో ఉన్న కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై రౌస్ ఎవెన్యూ ప్రత్యేక కోర్టులో సోమవారం విచారణ కొనసాగింది. కవిత తరపున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. సోషల్ మీడియా వ్యవహారాలకు సంబంధించి మాత్రమే విజయ్ నాయర్‌తో కవిత భేటీ అయ్యారని స్పష్టం చేశారు. ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అరెస్ట్ నుంచి విచారణ వరకు మెటీరియల్ లేదని, ఆధారాలేవీ లేకుండానే, అరెస్ట్ చేయాల్సిన అవసరం లేకుండానే, ఈడీ కస్టడీలో ఉండగానే సీబీఐ ఆమెను ఎందుకు అరెస్ట్ చేసిందని ప్రశ్నించారు. కవిత బీఆర్ఎస్‌కు స్టార్ క్యాంపెయినర్ అని, చిదంబరం కేసులో ఇచ్చిన తీర్పు కవిత విషయంలో వర్తిస్తుందని, ఏడేండ్ల లోపల శిక్ష పడే కేసులకు అరెస్ట్ అవసరం లేదని వెల్లడించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన అరుణ్ రామచంద్రన్ పిళ్లై 10 స్టేట్‌మెంట్స్ ఇచ్చారని, కవితకు వ్యతిరేకంగా ఆధారాలు లేవని తెలిపారు. అనుమనితురాలిగా కూడా లేని కవితను నిందితురాలిగా మార్చారని చెప్పారు. విచారణకు హాజరైనా మార్చి 15న అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు.

బీజేపీ అనుకూలురకు బెయిల్

కవిత- కేజ్రీవాల్‌ను కలిపి విచారించడంలో ఈడీ విఫలమైందని సింఘ్వీ తెలిపారు. విజయ్‌నాయర్ సోషల్ మీడియా వ్యవహారం చూస్తారని, ఆ అంశం పైనే ఆయనతో కవిత భేటీ అయ్యారని వివరించారు. బుచ్చిబాబు నాలుగు స్టేట్‌మెంట్స్ ఇచ్చారని, ఈడీకి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చాకే ఆయనకు బెయిల్ వచ్చిందని తెలిపారు. రాఘవరెడ్డి బీజేపీతో పొత్తులో ఉన్న పార్టీ తరపున లోక్‌సభకు పోటీ చేస్తున్నారని, ఆయన ఎందుకు ఆ పార్టీలో చేరాల్సింది వచ్చిందని ప్రశ్నించారు. శరత్‌రెడ్డి బీజేపీ ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తి అని తెలిపారు. వాళ్లు ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా కవితను అరెస్ట్ చేశారని నొక్కిచెప్పారు. ఎవరికి ఫోన్ ఇచ్చినా ఫార్మాట్ చేసే వాడతారని కవిత న్యాయవాది వెల్లడించారు. కవిత వాడిన ఆరు మొబైల్ ఫోన్లను కూడా ఈడీకి ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్‌కు కవిత స్టార్ క్యాంపెయినర్ అని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ వాదనను సీబీఐ తరపు న్యాయవాది వ్యతిరేకిస్తూ లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని, బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారన్నారు. అనంతరం ఈడీ తన వాదనలను వినిపించింది. ఫోన్లను కావాలని ఫార్మాట్ చేశారని, 11 మొబైల్ ఫోన్లలో డాటాను ధ్వంసం చేశారని, ఇదే విషయాలను కేసు ఫైల్‌లో కూడా వివరించామని ఈడీ తెలిపింది. తదుపరి విచారణ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొనసాగనుంది. తుది ఉత్తర్వులను మే 2 వరకు రిజర్వు చేయనున్నట్టు జడ్జి కావేరి బవేజా ముందుగానే వెల్లడించారు.

144 మంది అభ్యర్థుల నామినేషన్లు

25న ముగియనున్న గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలకు సోమవారం 144 అభ్యర్థులు 169 సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు. నామినేషన్‌ల గడువు ఈనెల 25న గురువారంతో ముగియనుంది. సోమవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో నిజామాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్, హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్, నాగర్ కర్నూలు బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్, వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్ కుమార్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు.

అలవెన్సులు, డైట్ చార్జీల్లో కోత వద్దు

- ఇతర రాష్ట్రాల తరహాలో ప్రోత్సహకంగా ఇవ్వాలి
- ఎన్నికల డ్యూటీ హోంగార్డుల వినతి
- సీఎం, డీజీపీలకు వేడుకోలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): రోజూ గంటల తరబడి గొడ్డుచాకిరీ చేస్తున్న తమపై పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం కనికరం చూపడం లేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులకు హాజరైన తమకు డైలీ డ్యూటీ అలవెన్సులు, డైట్ చార్జీలు కట్ చేసి కడుపు కొట్టొద్దని వేడుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులకు వెళ్లిన హోంగార్డులకు వేతనంతో కలిపి డైలీ డ్యూటీ అలవెన్సును ప్రోత్సాహకంగా ఇస్తున్నారని, తెలంగాణలో మాత్రం డైలీ డ్యూటీ అలవెన్సును కట్ చేస్తున్నారని వాపోతున్నారు. ఇటీవల తమిళనాడులో తొలిదశ పార్లమెంట్ ఎన్నికలకు తెలంగాణ నుంచి 2 వేల మంది హోంగార్డులను పంపారు. దీంతో వారు ప్రయాణంతో కలిపి ఏడురోజులు విధులు నిర్వర్తించారు. కానీ, ఈసారి డైలీ డ్యూటీ అలవెన్సును కట్ చేయబోమని చెప్పిన ఉన్నతాధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. 'తమిళనాడులో ఎన్నికల విధులు నిర్వర్తించిన తెలంగాణ హో